# కూడు

డాక్టర్ విఠల్ ఆరోజు చాలా చిరాగ్గా వున్నాడు. అతనా ఊళ్లో ప్రాక్టీసుపెట్టి ఆర్నెల్లయ్యింది. ఇన్నాళ్ళు అతను ఆశ నిరాశలమధ్య దూరాన్ని కొలుచుకుంటూ కాలక్షేపం చేసాడు.

ఆ ఊళ్లో పదివేలమంది జనం వున్నారు. నామాల డాక్టరుగా పిలవబడే గోవిందరాజు పదిహేనేళ్ళగా ఆ వూళ్ళో వైద్యం చేస్తు న్నాడు. అతను ఎల్.ఎమ్.పి. పాసయ్యాడు. అతనికి ఆ వూళ్లోనేగాక చుట్టుపక్కల మరో పది వూళ్ళల్లో కావల్సినంత పలుకుబడి, కావల్సిన దానికంటె ఇంకాస్త ఎక్కువ సంపాదన వున్నాయ్. అతను వైద్యం మాత్రం చేస్తాడు. అపరేషన్లుంటే పట్టణానికి మరో డాక్టర్ దగ్గరకు పంపుతాడు. ఎం.బి.బి.యస్. పాసైన విఠల్ ప్రాక్టీసు పెట్టినా ఈ ఆర్నెల్లలోను గోవిందరాజు సంపాదన, పలుకుబడి ఏమాత్రం తగ్గ లేదు. విఠల్‌కి బోణీకూడా కాలేదు.

ఆరోజు విఠల్‌కి చిరాకుతోపాటు కోపంకూడా పెరిగింది. ఆ వూరిమీద, అక్కడి జనంమీద, తన చదువుమీద, అక్కడ ప్రాక్టీసు పెట్టించిన తన మేనమామమీద వరుసగా కోపం వచ్చింది.

సరిగ్గా అదే సమయానికి పక్కగదిలో వున్న నర్స్ హేమలత కూడా చిరాగ్గా వుంది.

"భోజనానికి వెళ్ళమని చెప్పడేం ఎంతకి? ఏదో వంద పురిటి కేసులున్నట్టు" అనుకుంటోంది. ఆమె అక్కడ కూర్చుని దిండు సైజు తెలుగు నవల చదువుకుంటోంది.

సరిగ్గా అదే సమయానికి కాంపౌండర్ జాన్ కూరగాయల కొట్టు వాడిమీద చిరాకు పడుతున్నాడు.

సైకిలెక్కుతూ "నేను ఈ డాక్టర్ దగ్గర చేరింది కూరగాయలు కొనడానికా?" అనుకున్నాడు.

సరిగ్గా అదే సమయంలో ఆమె హాస్పిటల్ లోపలికి వచ్చింది.

ఆమెకు పాతికేళ్ళపైన వుంటాయి.

జీవితంలో విసిగిపోయినట్టు ఆమె ముఖం అలసటగా వుంది.

ఆమె చీరకున్న చిరుగులు పొడమచ్చల్లా వుండి ఆమె ఆర్థికారోగ్యాన్ని తేల్చి చెపుతున్నాయి. ఆమె చెవలకున్న రింగులు.... నకిలీవి.

అవి పరాయి యజమాని దగ్గర ఫణ్ణేస్తున్న నౌకర్లల్లా వేళ్ళాడి పోతున్నాయి. ఆమె ముఖానికి పూసుకున్న చౌకరకం పౌడరు చెమటతో తడిసి అసహ్యంగా వుంది.

ఆమె సిగ్గుపడటం తెలియని ఆడదాన్లా వున్నా, ఏదో తెలియని భయం ఆమె వేస్తున్న అడుగులకు అడ్డం వస్తోంది.

ఆఖరిసారి ఇంటర్వ్యూకి వెడుతున్న గ్రాడ్యుయేట్లా ఆమె అసహనంగా వుంది.

డాక్టర్ విఠల్ ఆమెను చూశాడు. అతనేం మాట్లాడలేదు.

"ఇలా వచ్చావేం?" అని ఆప్యాయత నిండిన మాటల్తో అడుగుతున్నట్టు చూశాడు.

"డాక్టరుగారు...."

"నేనే.... ఏంకావాలి?" మధ్యలోనే అన్నాడు.

ఆమెకు కొద్దికాలంగా ఎడం రొమ్ములో నొప్పి వస్తోంది.

ఇద్దరు ముగ్గురు డాక్టర్లకు చూపించింది. వాళ్ళు వైద్యం చేసినా తగ్గలేదు.

ఆమె చెప్పింది విన్నాడు. ఎగ్జామినేషన్ రూంలోకి తీసికెళ్ళి పరీక్ష చేశాడు.

రొమ్ము వాచింది. ట్యూమర్ ఫార్మ్ అయినట్టు అనుమానం కలిగింది. లెటర్ రాసిచ్చి పట్నంవెళ్ళి ఎక్స్‌రే తీయించుకు రమ్మన్నాడు.

రెండురోజులు పోయాక ఆమె ఎక్స్‌రేతో తిరిగి వచ్చింది.

ఎక్స్‌రేని పరిశీలనగా చూశాడు.

బయాప్సీ తీశాడు.

వారంపోయాక రమ్మనమని చెప్పాడు.

ఈ వారంలోను పుస్తకాల బూజు దులిపాడు. మరో డాక్టర్ ఫ్రెండ్‌ని కన్సల్టు చేశాడు.

కేస్ స్టడీ చేశాడు. రోగమేమిటో డయాగ్నైజు చేశాడు.

ఆమెకు.... బ్రెస్ట్‌కాన్సర్.

వారంపోయాక ఆమె వచ్చింది. డాక్టర్ విఠల్ రోగమేమిటో ఆమెకు చెప్పాడు.

అతను చెప్పేదేమీ ఆమె కర్థంకాలేదు.

"ఇంతకీ తగ్గాలంటే ఏం చెయ్యాలంటారు?" అసహనంగా అడిగింది.

"ఆపరేషన్ చెయ్యాలి" తడుముకోకుండా చెప్పాడు.

పులిని చూసిన మేకలాగ ఆమె భయంగా, బెదురుగా చూసింది.

ఆమె భయం ఆపరేషన్ గురించి కాదు. ఆమింకా ఆ విషయం గురించి ఆలోచించలేదు. ఆమె భయమల్లా ఆపరేషనుక్కావల్సిన డబ్బు గురించి....

ఓసారి పైకి, మరోసారి డాక్టర్ ముఖంలోకి, చివర్న నేలమీదకి చూసిందామె.

"ఆపరేషన్ చేయించుకుంటావా ?" ఆప్యాయంగా అడిగాడు విఠల్.

"ఎంత ఖర్చవుతుంది?" ఆత్రంగా అడిగిందామె.

"కాస్త ఆలోచించి అన్నాడు విఠల్ - మూడొందలు."

ఈసారి ఆమె అతని ముఖంలోకి ఇంకా భయంగా చూసింది.

అది చావు భయాన్ని మించిన భయం.

'మూడొందలు తేవడంకన్నా- చచ్చిపోవడం నాకు చాలా యీజీ' అన్నట్టున్నాయి ఆమె చూపులు.

"ఆపరేషన్ చేయించుకోకపోతే ఏమౌతుంది ?" డాక్టర్ ముఖం లోకి తీక్షణంగా చూస్తూ అడిగింది.

"ప్రాణానికి భయం.... ఆపరేషన్ వెంటనే జరగాలి. ఆలస్యం చేసినా ప్రమాదమే...." కన్విన్సింగ్‌గా చెప్పాడతను.

'అంతేకదా'— అన్నట్టు చూసిందీసారి.

ఈ లోకంతోను, దాని తాలూకు బంధాల్తోను సంబంధం తెంచు కున్న ఋషిలా నవ్వింది.

ఆ నవ్వులో ఏ వేదాంతికీ అర్థంకాని వేదాంతం వుంది.

ఏ జ్ఞానికీ అర్థంకాని వైరాగ్యం వుంది.

ఆ నవ్వునీ, ఆమె మౌనాన్ని భరించలేకపోయాడు డాక్టర్ విఠల్.

"మరయితే ఆపరేషన్ చేయించుకుంటావా?"

"ఆఁ అంతడబ్బు లేదు.... ఓ ఇరవై రూపాయలెట్టి మందు లయితే కొనుక్కుంటాను."

ఈ బతుకుభారాన్ని నేనిక మోయలేనన్నట్టు చెప్పింది.

ఎంతోమంది వందలు, వేలు, లక్షలు, సిగ్గు, అభిమానం, ఆత్మ గౌరవం వెచ్చించి కాపాడుకునే ప్రాణంకోసం.... ఆమె ఇరవై ....

....కేవలం ఇరవై రూపాయలుమాత్రం ఖర్చుచెయ్యగలదు....

మరో ఇరవై అర్జంటుగా కావాలంటే....

ప్రాణాలు వదిలెయ్యడం ఆమెకు తేలిక....

ఆమె పరిస్థితిని అతను అర్థం చేసుకున్నారు. ఆమె ఆలోచనల్ని అతను చదివేడు.

"సరే అయితే ఆపరేషన్ ఏ ఖర్చు లేకుండా నేనే చేస్తాను. మందుల ఖర్చుకూడా నాదే- చేయించుకుంటావా?"

ఆమె ఆశ్చర్యంగా చూసింది.

యముడొచ్చి తన ప్రాణాలు పట్టుకపోతూవుంటే తన ఇష్ట దైవం వచ్చి యముణ్ని, వాడి దున్నపోతుని ఓడించి తన ప్రాణాలు తనకు తిరిగి ఇచ్చేస్తున్నట్టు ఫీలయింది.

సరేనంది....

"రేపురా- ఎవర్నన్నా తోడు తెచ్చుకో" అన్నాడు విఠల్....

"నాకెవరూ తోడు లేరు" అందామె.

ఆరోజు.... కొట్టుకునే గుండెల్ని అదిమిపట్టుకుని ఆమె భయం భయంగా ఆపరేషన్ థియేటర్‌లోకి అడుగు పెట్టింది.

డాక్టర్ విఠల్ అలసట, ఆనందం నిండిన ముఖంతో ఆపరేషన్ థియేటర్‌లోంచి బైటికివచ్చాడు.

సక్సెస్.... తన మొట్టమొదటి ఆపరేషన్ సక్సెస్....

కాంపౌండర్ జాన్ ఫ్లాస్కులో కాఫీ కప్‌లో పోసిచ్చాడు.

ఆత్రంగా తాగాడు విఠల్....

మరికొంచెంసేపుపోయాక పేషెంట్‌ని చూశాడు.

జనరల్ కండిషన్ బాగానే వుంది.

"ఇంటికెళ్ళి ఈ వార్త రుక్మిణితో చెప్పాలి. ఆమె ముఖంలో కురిసే వెన్నెల్లో తడిసిపోవాలి" అనుకున్నాడు.

హేమలత కివ్వాల్సిన సలహా లిచ్చేసి భోజనానికి వెళ్ళిపోయాడు.

ఇంటికెళ్ళేసరికి అత ననుకున్నట్టు భార్య ఎదురురాలేదు. ఆమెను వెతుక్కుంటూ అతనే లోపలికెళ్ళాడు. "బ్రెస్ట్‌కేన్సర్ ఆపరేషన్ సక్సెస్" గట్టిగా అన్నాడు. పిల్లాడికి పాలిస్తున్న అతని భార్య కొంగు కిందకు లాక్కుంది.

ఓ గంట పోయాక మళ్ళీ అతను హాస్పిటల్ కొచ్చాడు.

ఆమె బెడ్ ప్రక్కనే స్టూలుమీద కూర్చొని ఆమె నాడి చూశాడు. నాలుక చూశాడు.

చివర్న లేస్తూ ఆమె కళ్ళల్లోకి చూశాడు.

చూడమ్మా.... ఆపరేషన్ చక్కగా జరిగింది. కొద్దిరోజుల్లో నువ్వు మామూలు మనిషిలా తిరుగుతావ్.... నువ్వేం భయపడొద్దు" ఆమెకు ధైర్యం చెప్పడానికి ప్రయత్నించాడు.

ఆమె రెండుచేతులు ముఖానికి అడ్డంపెట్టుకుని ఘొల్లున ఏడ్చింది.

ఆమె ఏడుపు సముద్రం పొంగినట్టు భయంకరంగాను, తుఫాను వచ్చినట్టు ఆందోళనకరంగాను వుంది. ఆమె అందర్నీ పోగొట్టుకున్న మనిషిలా వణికిపోతోంది.

విఠల్ కలవరపడ్డాడు....

ఆమెబాధ అతనికర్థమైంది. స్త్రీగా ఆమె బాధపడ్డం సహజమే....

ఆమె ప్రాణాలు కాపాడ్డంకోసం ఆమె అందాన్ని హత్య చెయ్యాల్సొచ్చింది. ఆమె ఎడంరొమ్ము పూర్తిగా తీసెయ్యాల్సి వచ్చింది. ఆమెను ఊరడించడానికి ప్రయత్నించాడు.

మరో పదిహేనురోజుల తర్వాత ఆమెను హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేశారు.

ఆమె వెళ్ళిపోతూ తనకేసి చూసిన చూపులు డాక్టర్ విఠల్ని కల వరపెట్టాయి.

ఆమె ఆశీర్వదిస్తోందో- శపిస్తోందో అతని కర్థంకాలేదు.

◆ ◆ ◆

"ఇంత కుర్ర డాక్టర్ కేన్సర్ ఆపరేషన్ చెయ్యడవా(?"

అందరూ ఆశ్చర్యపోయారు. ఆ వార్త వూళ్ళోనేగాక పక్క వూళ్ళన్నీ పాకింది.

అత నెలాంటి రోగాన్నైనా కుదర్చగలడని ప్రజలకు నమ్మకం కుదిరింది.

అతని ప్రాక్టీసు పెరిగింది. ప్రతిష్ట పెరిగింది. పలుకుబడి పెరిగింది. సంపాదన పెరిగింది. కొద్ది నెలల్లోనే అతను బిజీ డాక్టరై పోయాడు.

అతను అశ్వినీదేవతల అనుగ్రహంతో వైద్యం చెయ్యడానికి కుబేరుని అనుగ్రహంతో డబ్బు సంపాయించడానికి పుట్టినవాళ్ళా మెరిసిపోతున్నాడు.

సంవత్సరం తిరిగేసరికెల్లా అతను ఉండడానికో మంచి ఇల్లు, తిరగడానికో అందమయిన కారు కొనుక్కున్నాడు.

*　　　　*　　　　*

ఓరోజు మధ్యాహ్నం నిద్రపోతున్న విఠల్ని సీరియస్‌కేసంటూ లేపారు.

ఒకతన్ని అపస్మారకపు స్థితిలో తీసుకొచ్చారు. అతని కుడి కాలికి గుడ్డలుచుట్టి తీసుకొచ్చారు.

అతని ఒళ్ళంతా.... గుడ్డల్నిండా రక్తం.

అతనో లారీడ్రైవర్.... వూరిచివర ఏక్సిడెంట్ జరిగింది. డ్రైవర్ చక్రంక్రింద పడిపోయాడు. అతనికి బాగా దెబ్బలుతగిలాయి.

డాక్టర్ విఠల్ కట్టు విప్పి చూశాడు.

కాలు బాగా క్రష్ అయిపోయింది. చితికిపోయిన నరాలు నరకంలో పాపుల్లా వేళ్ళాడిపోతున్నాయి.

అలాంటి వెన్నో దృశ్యాలు చూసిన విఠల్‌కే భయం కలిగించేటట్లు వుందా దృశ్యం.

తాత్కాలికంగా వైద్యంచేసి కట్టుకట్టాడు విఠల్.... ఆ రాత్రికి

డ్రైవర్ తమ్ముడు, భార్య, ముసలితల్లి లారీ ఓనరూ వచ్చారు. అప్పటికీ డ్రైవరు అపస్మారకంలోనే వున్నాడు.

మర్నాడుదయం కళ్లు విప్పి చూశాడు.

"తన అనుమానం నిజమయింది."

డ్రైవర్ తమ్ముణ్ణి, లారీ ఓనర్ని గదిలోకి పిల్చి చెప్పాడు విటల్.

"వెంటనే ఆపరేషన్ చెయ్యాలి. లేకపోతే బతకడు—"

తెల్లకాయితంమీద సంతకం పెడుతున్నప్పుడు డ్రైవర్‌తమ్ముడు ఇష్టం లేకుండా రాజ్యపాలన కంగీకరించిన భరతుడిలా దీనంగా అన్నాడు.

ఆపరేషన్ విషయం అందరికీ తెల్సింది.

ఒక్కసారి ఘొల్లుమన్నారు....

వాళ్ళ ఏడుపుల మధ్య డ్రైవర్ని ఆపరేషన్ థియేటర్‌లోకి తీసికెళ్ళారు. ఆపరేషన్ మూడుగంటలు పట్టింది.

థియేటర్‌లోంచి బయటికి వచ్చిన డాక్టర్‌వంక అంతా ఆత్రంగా చూశారు.

"అదృష్టవంతుడు. బతుకుతాడు" అన్నాడు గ్లౌజ్ తీసేస్తూ—

మర్నాడు ఉదయంవరకు డ్రైవరు స్మారకానికి, అపస్మారకానికి మధ్య ఊదులాడుతున్నాడు.

రౌండ్స్‌కి వెళ్ళిన విటల్ డ్రైవరున్న రూంకి వెళ్ళాడు.

డ్రైవర్‌చుట్టూ అతని జనమంతా వున్నారు.

"నా కొడుకుని కాపాడారు. మీరు భగవంతుడితో సమానం బాబూ" డ్రైవరు తల్లి దణ్ణాలు పెడుతోంది.

డాక్టర్ని చూసి వెల్లికిల్లా పడుకున్న డ్రైవరు లేవడానికి ప్రయత్నించాడు.

అతనికేదో అనుమానం కల్గింది.

చేత్తో కాళ్ళు తడిమి చూసుకున్నాడు.

"డాక్టర్...."

అతని అరుపుకి అక్కడి వాళ్ళంతా జడుసుకున్నారు. ఆ అరుపు భూమి, ఆకాశంకల్సి ప్రకృతిమీద తిరుగుబాటు చేస్తున్నట్టు భయంకరంగా వుంది.

"నా కాలు తీసేశావు- నేను నీలాగ చదువుకోలేదు. ఎలా బతకను- ఈళ్ళంతా ఏమైపోతారు. నా నోటిదగ్గర కూడు లాగేశావు.

ఈ పాపం నీదే.... నీదే.... నీదే"

అతను ఘోరంగా, భయంకరంగా, బాధాకరంగా ఏడుస్తున్నాడు.

అతను పిచ్చివాళ్ళా అరుస్తున్నాడు.

అతని ఏడుపులో రెక్కవిరిగిన పక్షిచేసే జీవనపోరాటం వుంది.

తిండి దొరకని ఎన్నో జీవాల ఆక్రందన వుంది.

పుట్టంగానే తల్లి రొమ్ముచేరాలనే తపన....

చచ్చేవరకు కూటికోసం మనిషిపడే ఆరాటం.

ఎవరు?.... ఎన్నాళ్ళు?....

ఏ రెండు తీరాలమధ్య ఈ భయంకరపు పరుగు.

ఆకలితో బిడ్డ ఏడ్చే ఏడుపుకీ.... ఆరాటపడే తల్లి రొమ్ముకి మధ్య.... ఎన్ని యోజనాల అనుల్లంఘనీయ దూరం....?

విటల్ మనస్సంతా వికావికాలమైపోయింది.

ఆలోచిస్తున్నకొద్దీ పిచ్చివాణ్ణయిపోతానేమోనన్న భయం కల్గింది.

ఆ రోజంతా డ్రైవర్ విఠల్ మనస్సులో భయంకరంగా, బాధాకరంగా సుళ్ళు తిరుగుతున్నాడు....

ఆ సాయంత్రం.... పట్టణంలో స్నేహితుడిచ్చిన పార్టీ ముగించుకుని హోటల్లోంచి బైటికొచ్చాడు విటల్.

కారు డోర్ తీస్తూ ముష్టిదాని పిలుపుకి ఓ క్షణం ఆగాడు.

అర్ధరూపాయి తీసి ఆమె చేతిలో వేశాడు.

కారెక్కబోతూ ఆమె ముఖంలోకి చూశాడు.

ఎక్కడో చూసినట్టు జ్ఞాపకం....

మర్చిపోలేని ముఖం....

తనకు చాలా తెల్సున్న....

తనకు చాలా కావల్సిన మనిషి.

గుర్తుపట్టాడు....

యస్.... ఆమే....

ఇక్కడెలా వుంది?

ఆమె జబ్బుచేసిన భూదేవిలా వుంది. ఆమె కళ్ళు కాంతిని పోగొట్టుకున్న సూర్యుడిలా డల్‌గా వున్నాయి-

'ఆమె వందశాపాల్ని అనుభవిస్తున్నట్టు దీనంగా, అసహ్యంగా వుంది.

ఆమె తన మొట్టమొదటి పేషెంట్....

బ్రెస్ట్ కేన్సర్‌కి తనే ఆపరేట్ చేశాడు....

ఆమె అతని ముఖంలోకే చూస్తోంది.

"నేను గుర్తున్నానా" అన్నాడు చిర్నవ్వుతో....

"మిమ్మల్నెలా మర్చిపోతాను.... నా బతుకుని మార్చింది మీరేగా.... ?"

కాంప్లిమెంట్ ఆనందంగా స్వీకరించాడు.

"అదేం అడుక్కుంటున్నావేం?" మట్టిలో ఆడుకునే రాజుగారి కొడుకుని మంత్రిగారు అడిగినట్లు అడిగాడు.

"ఇది మీ చలవే బాబూ ఆరోజు ఆపరేషన్ చేశారుగా- నా కూట్లో రక్తం పోశారు."

రెండు చేతులు ముఖానికి అడ్డం పెట్టుకుని గోరంగా ఏడుస్తోంది.

మర్యాదకు, నాగరికతకు, విలువలకు అతీతమైన ఏదో బాధ కార్చిచ్చులా మండుతోంది ఆమె ఏడుపులో. చుట్టూ ఉన్నవాళ్ళు చూస్తారేమోనని కంగారు పడ్డాడు విఠల్.

గబగబ కారెక్కి స్టార్టుచేశాడు–

ఆమె ఏడుపు అతన్ని వెంబడిస్తోంది....

అతనికి లారీ డ్రైవరు గుర్తుకొచ్చాడు.

ఆమె ఏడుపులో అతని ఏడుపు స్పష్టంగా విన్పించింది.

ఇద్దరి ఏడుపుల్లోని ఆక్రందన, ఆరాటం ఒకేలాగ అన్పించాయి.

అతని మనస్సు సంవత్సరం వెనక్కి వెళ్ళింది.

ఆనాటి తన ఆలోచన, ఆ సంఘటన అతన్ని మళ్ళీ నలపడం మొదలెట్టింది.

ఆమెకు నిజంగా బ్రెస్ట్‌కేనర్స్ కాదు.

ఆనాడలా చెయ్యకపోతే తన కూడు తనకో సమస్య అయ్యేది. అతని మనస్సులో బాధ ఎక్కడో అంతరాంతరాల్లో ముల్లులా గుచ్చుకుంటోంది.

డాష్‌బోర్డులో సీసా తీసి గటగటా తాగేశాడు. బాధని మర్చిపోవడానికి ప్రయత్నించాడు....

ఆకలితో ఉన్న రాక్షసుడిలా కారు భయంకరంగా ముందుకు పోతోంది.

— "స్వాతి" 1978